సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి 8లో

ఎల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయ సునీత కోరారు.



జాఫ్రాకు గిట్టుబాటు ధర

జాఫ్రా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపడుతున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. 8లో



జగనన్న పాలనలో మహిళలే మహారాణులు 8లో

మహిళలు మహారాణుల్లా అభివృద్ధి చెందుతున్నారని అరకు ఎమ్మెల్యే పాల్గుణ అన్నారు.

న్యూస్‌రీల్

ధారాలమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి 3న శంకుస్థాపన



సిద్ధాంతిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ అధికారులు

సీలేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం, మన్యం గిరిజనుల కులదేవత ధారకొండ ధారాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేసినట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. రూ.50 లక్షలతో నిర్మించనున్న ఈ ఆలయానికి వచ్చే నెల 3న శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ముహూర్తం ఖరారు చేసిన సిద్ధాంతి ప్రసాద్‌ను సత్కరించారు. ఈవో సాంబశివరావు, ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు, ఆలయ కమిటీ సభ్యుడు గొర్లె గణేశ్వరరాజు, నాగేశ్వరరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీలు



అరకు సంతలో కాటాలను తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో శుక్రవారం తూనికలు, కొలతలశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు రామచంద్రయ్య, రామారావు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కాటాల్లో వ్యత్యాసాన్ని గుర్తించిన వారు వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నట్టు వారు తెలిపారు. వినియోగించే కాటాలకు సీలు తప్పనిసరి అని సూచించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదివాసీలకు రాజ్యాధికారమే లక్ష్యం

- దండకారణ్య జనతా పార్టీ వ్యవస్థాపకుడు చెండా ఎలియా



మాట్లాడుతున్న చెండా ఎలియా

అరకులోయ రూరల్: ఆదివాసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం సాగిస్తామని దండకారణ్య జనతా పార్టీ వ్యవస్థాపకుడు చెండా ఎలియా తెలిపారు. మండల కేంద్రం అరకులోయలో శుక్రవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. ఆదివాసీలు హక్కులు, చట్టాలు పరిరక్షించాలంటే ప్రత్యేక రాష్ట్రం అవసరమన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రంజిత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు జాన్ పాల్గొన్నారు.

108లో సుఖ ప్రసవాలు



శిశువును చూపిస్తున్న 108 సిబ్బంది

పెదబయలు: మండలంలో 108 అంబులెన్స్‌లో ఒకే రోజు రెండు ప్రసవాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున లింగేటి పంచాయతీ జెరుకుల పెదబయలుకులో పురిటి నొప్పులతో బాధపడుతున్న లువ్వాబు రామలక్ష్మిని 108లో ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలించారు. అడుగులపుట్టు పంచాయతీ వద్దే కోడాపుట్టులో పురిటినొప్పులతో బాధపడుతున్న జర్సింగి కేశమ్మను 108 వాహనంలో ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో ఆమె కూడా మగశిశువుకు జన్మనిచ్చింది. వీరిని కూడా ఆస్పత్రికి తరలించినట్టు 108 ఈఎంటీ వి.రవి, పైలట్ కె.రమేష్, ఆశ కార్యకర్తలు చిన్నతల్లి, సత్యవతి తెలిపారు.

యువతకు ప్రేరణ

మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన జిల్లాలో పోలీసు ఉద్యోగం నిత్యం కత్తి మీద సామే..వారు ఒక వైపు విధులను సమర్థంగా నిర్వహిస్తూ మరో వైపు గిరిజనులకు అండగా నిలుస్తున్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే గిరిజన యువతకు చదువుతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం ప్రేరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలువురు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించి, వారి ఉన్నతికి బాటలు వేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత రెండేళ్ల నుంచి యువతులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

- గిరిజన యువతకు చేదోడుగా పోలీస్ శాఖ
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న అధికారులు
- ప్రశాంతి ఎడ్యుకేషన్ సంస్థతో కోచింగ్‌కు ఒప్పందం
- టాటా ఎలక్ట్రానిక్స్‌లో ఉద్యోగాలు
- 1,142 మందికి కొలువులు



ఎంపిక కార్యక్రమానికి హాజరైన గిరిజన నిరుద్యోగ యువతులు (ఫైల్)



గిరిజన యువతులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న టాటా గ్రూపు ప్రతినిధులు(ఫైల్)

పాడేరు : నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పోలీసుశాఖ చేపట్టిన ప్రేరణ కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. చింతపల్లి ఏఎస్పీగా ఉన్నప్పుడు సతీష్‌కుమార్ 2022లో ఈ కార్యక్రమం ప్రారంభించారు. మహిళలకు కుట్టు శిక్షణ, యువకులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి వారిని స్వయం ఉపాధి వైపు మళ్లించారు. ఇప్పుడు విద్యావంతులైన యువతీయువకులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

- గత ఏడాది జీకే వీధి మండలం ధారకొండలో పదిమంది మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చి, ఉచితంగా మిషన్లు అందజేశారు.
- ఇదే ఏడాది 79 మంది గిరిజన యువతులకు శ్రీకాకుళం జిల్లా రాజాంలో ఉచితంగా హోమ్ నర్సింగ్ శిక్షణ ఇచ్చారు.
- చింతపల్లి వైటీసీలో 150 మంది విద్యార్థులకు పాలిసెట్‌కు శిక్షణ ఇచ్చారు.
- ప్రేరణ కార్యక్రమం ద్వారా యువతులకు ప్రత్యేకంగా ఉద్యోగావకాశాలు కల్పించడంపై దృష్టి సారిస్తున్నారు. టాటా ఎలక్ట్రానిక్స్, ప్రశాంతి ఎడ్యుకేషన్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని శిక్షణ, ఉద్యోగఅవకాశాలు కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా 2022లో 400 మందిని ఎంపిక చేసి, శిక్షణ ఇవ్వగా 74 మంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మలివిడతగా తాజాగా సుమారు 1,142 మందిని శిక్షణకు ఎంపిక చేసినట్టు అధికారులు తెలిపారు.

నాలుగు చోట్ల ఇంటర్వ్యూలు

తమిళనాడులోని టాటా ఎలక్ట్రానిక్స్‌లో టెక్నికల్ అసిసెంట్లుగా నియమించేందుకు జిల్లా వ్యాప్తంగా నాలుగు చోట్ల యువతులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,450 మంది నిరుద్యోగ గిరిజన యువతులకు హాజరు కాగా, వీరిలో 1,142 మంది ఎంపికయ్యారు.

- చింతపల్లిలో ఈనెల 6న నిర్వహించిన ఇంటర్వ్యూలకు చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల నుంచి 450 మంది హాజరు కాగా 350 మందిని ఎంపిక చేశారు.
- పాడేరులో ఈనెల 8న నిర్వహించిన ప్రేరణలో పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, అరకువేలి, అనంతగిరి మండలాలకు చెందిన 320 మంది గిరిజన నిరుద్యోగ యువతులు హాజరయ్యారు. వీరిలో 250 మందిని ఎంపిక చేశారు.
- రంపచోడవరంలో ఈనెల 10న నిర్వహించిన ప్రేరణకు 450 మంది హాజరు కాగా 412 మంది ఎంపికయ్యారు.
- ఎటపాకలో ఈనెల 12న నిర్వహించిన ప్రేరణకు 230 మంది హాజరు కాగా 130 మంది ఎంపికయ్యారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తున్నాం



జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో గిరిజన యువతులు చాలామంది ఉన్నత చదువులు చదువుకుని ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఖాళీగా ఉండటాన్ని గుర్తించాం. ప్రభుత్వ సహకారంతో పోలీసు శాఖ ద్వారా కొంతైన నిరుద్యోగ సమస్య తీర్చేందుకు చర్యలు చేపట్టాం. టాటా ఎలక్ట్రానిక్స్, ప్రశాంతి ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌తో ఒప్పందం చేసుకున్నాం. జిల్లా నుంచి కొత్తగా 1,142 మందికి ఉద్యోగాలు వచ్చేలా ప్రణాళిక రూపొందించాం. నిరుద్యోగ గిరిజన యువతులు ఉద్యోగాల్లో స్థిరపడి మిగిలిన మహిళలకు ఆదర్శంగా నిలవాలి.

– తుహిన్ సిన్హా, ఎస్పీ, పాడేరు

శిక్షణ, ఉద్యోగం: ఎంపికైన అభ్యర్థులకు తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లోని టాటా ఎలక్ట్రానిక్స్‌లోని ఐఫోన్ కంపెనీలో 11 నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తున్నారు. ఉచిత భోజన, వసతులతో పాటు అన్ని అలవెన్సులు కలుపుకొని నెలకు సుమారు రూ.18వేల వేతనం చెల్లించనున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే వీరికి పీఎఫ్, వైద్యం, ఇతర సదుపాయాలు కల్పించనున్నారు.

- ఎంపికైన గిరిజన నిరుద్యోగ యువతులు గత శుక్రవారం హోసూరుకు బయలుదేరి వెళ్లారు. వీరిని టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ సమకూర్చిన ప్రత్యేక బస్సులో పంపారు.

ఉద్యోగంలో స్థిరపడతా



మాది హుకుంపేట మండలం అండిభ గ్రామం. ఇటీవల పోలీసు శాఖ ద్వారా నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఎంపికయ్యాను. హోసూరు వెళ్లి పేరొందిన టాటా కంపెనీలో శిక్షణ తీసుకోనుండడం ఎంతో ఆనందగా ఉంది. శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగంలో స్థిరపడతాను.

– టి. రత్నకుమారి, అండిభ, హుకుంపేట

శిక్షణకు ఎంపికవడం ఆనందంగా ఉంది



పోలీస్ శాఖ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపిక కావడం ఆనందంగా ఉంది. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగంలో స్థిరపడతాను. తల్లిదండ్రులను బాగా చూసుకోవాలన్నది నా తాపత్రాయం.

– కె. శ్రావణి, వై. సోలముల గ్రామం, పాడేరు మండలం

కాఫీ కొనుగోలుదారులపై దాడి

- పోలీసులకు ఫిర్యాదు

గూడెంకొత్తవీధి: మండలంలోని గిరిజన రైతులనుంచి కాఫీని కొనుగోలు చేస్తున్న ఒక స్వచ్ఛందసంస్థ సిబ్బందిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడినట్టు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో మణిఅమ్మ చైతన్య స్రవంతి స్వచ్ఛందసంస్థ సన్న చిన్నకారు రైతుల నుంచి కాఫీకొనుగోలు చేస్తోంది. ఎప్పటికప్పుడు నగదు చెల్లిస్తోంది. ఈక్రమంలో మండలంలోని జర్రెల పరిసర ప్రాంతాల్లో రైతుల వద్దనుంచి ఈనెల 21న సుమారు ఏడు టన్నుల కాఫీని కొనుగోలు చేసిన సంస్థ ప్రతినిధులు ఈమేరకు రైతులకు నగదు చెల్లించారు. సరకుతో మండల కేంద్రానికి వాహనంలో వస్తుండగా సంస్థకు చెందిన శివ అనే వ్యక్తిని దారికాచి ఇద్దరు వ్యక్తులు అడ్డగించారు. ద్విచక్రవాహనంపై వచ్చిన వీరు రైతుల వద్దనుంచి కాఫీని కొనడానికి వీల్లేదని హెచ్చరించినట్టు అతను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాను వ్యాపారిని కాదని ఒక స్వచ్ఛందసంస్థలో పనిచేస్తున్నానని చెప్పినా వారు వినకుండా తనపై దాడికి పాల్పడినట్టు పేర్కొన్నాడు. సెల్‌ఫోన్ లాక్కుని చితక్కొట్టి చొక్కా చింపి మరోసారి కాఫీ కొనుగోళ్లకు వస్తే చంపేస్తామని బెదిరించి అక్కడనుంచి పరారయ్యారని శివ వివరించాడు. ఈఘటనకు సంబంధించి సంస్థ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అప్పలసూరి తెలిపారు. రైతులనుంచి కాఫీని కొనుగోలు చేసి తక్షణమే నగదు చెల్లించడాన్ని జీర్ణించుకోలేని కొందరు దళారులు దాడికి పాల్పడినట్టుగా తాము భావిస్తున్నామని సంస్థ చైర్మన్ అలివేణి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

వేపాడ (విజయనగరం జిల్లా): వేపాడ మండలంలోని బొద్దాం గ్రామానికి వలస కూలీగా వచ్చిన మింది వీరబాబు (22) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం భూసరపాడు గ్రామానికి చెందిన మింది వీరబాబు (22) బొద్దాం గ్రామంలో వలస కూలీగా గత నాలుగేళ్లుగా జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధ తాళలేక శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందడంతో వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం

- కలెక్టర్ విజయ సునీత ఆదేశం
- 110 అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులకు సంబంధించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ విజయ సునీత ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ భావన విశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి ప్రజల నుంచి 110 వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ రహదారులు, తాగునీటి సమస్యలపై అధికంగా వినతులు వస్తున్నాయన్నారు. వీటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న వేసవిను దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచి పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంతరిక్ష యానానికి ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని చింతూరు మండలం కొత్తపల్లికి చెందిన గిరిజనుడు దూది భద్రయ్య కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లక్ష్మణ మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వీవీఎస్ శర్మ, భవానీ, గిరిజన సంక్షేమ శాఖ ఈఈలు డీవీఆర్ఎం రాజు, వేణుగోపాల్, డీపీవో కొండలరావు, డీఎల్పీవో పీఎస్ కుమార్, ఎల్‌డీఎం ఎస్. రవితేజ పాల్గొన్నారు.

దూరవిద్య ప్రవేశాల నోటిఫికేషన్ రేపు

ఏయూక్యాంపస్(విశాఖ): ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) విధానంలో నిర్వహించే 38 కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ ఆదివారం జారీ చేస్తున్నట్లు దూరవిద్య సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వర రావు తెలిపారు. ఈ నెల 26 నుంచి వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు టీటీటీ. ప్రఃజీట్బిఇజీర్బిటట్జీఉ ఓర్ఫీ. భౌరు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. మొత్తం 17 యూజీ కోర్సుల్లో, 21 పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తారు. ఆసక్తి, అర్హత కలిగినవారు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నెరవేరిన ముఖ్యమంత్రి హామీ

బాధిత చిన్నారికి ఆర్థిక సాయం, పింఛను



చిన్నారి తల్లిదండ్రులను కలిసిన వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు

చింతూరు: మాటిస్తే నిలబెట్టుకునే నైజం తనదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు నిరూపించారు. అనారోగ్యంతో ఉన్న చిన్నారి బాధను కళ్లారా చూసిన ఆయన ఆమెకు ఆర్థికసాయం అందించడంతో పాటు పింఛను మంజూరుకు చర్యలు తీసుకున్నారు. చింతూరు మండలం మల్లెతోటకు చెందిన ధర్ముల నాగేశ్వర రావు, కుమారీ కుమార్తె ఐదేళ్ల హన్వికకు పక్షవాతం రావడంతో అనారోగ్యానికి గురైంది. దీంతో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ విషయాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వారు ఆ చిన్నారి తల్లిదండ్రులతో కలసి ఇటీవల వరద ప్రాంతాల పర్యటనలో భాగంగా కూనవరం మండలం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి చిన్నారి బాధను వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చిన్నారి వైద్యానికి రూ. లక్ష ఆర్థికసాయం అందించాలని, పింఛను మంజూరుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం చిన్నారి తల్లిదండ్రుల ఖాతాలో రూ.లక్ష జమ కావడంతోపాటు పింఛను కూడా మంజూరైంది. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలియజేశారు. ఆర్థికసాయంతో పింఛను మంజూరుకు చర్యలు తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డికి చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

డీడీవో బాధ్యతల అప్పగింతపై హర్షం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పంచాయతీ కార్యదర్శుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే పాల్గుణను సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

అరకులోయ టౌన్: గ్రేడ్ 5 కార్యదర్శులుగా గుర్తించి, డీడీవో (డ్రాయింగ్ అండ్ డిస్పాచ్‌మెంట్ ఆఫీసరు)గా ప్రభుత్వం జీవో నంబరు 11 జారీపై గ్రామ సచివాలయ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రేడ్ 5 గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తమను గ్రేడ్ 5 గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించి, డీడీవో బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు.సర్పంచ్‌లు చేపట్టిన పనుల బిల్లులకు సంబంధించి చెక్కుల జారీ, వలంటీర్లు, గ్రామసచివాలయ సిబ్బందికి జీతభత్యాలు చెల్లించేలా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు. మిఠాయిలు పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను సత్కరించారు. ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, మండల పార్టీ కన్వీనర్ పట్టాసి సంపత్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి గొల్లోరి గోపాలరావు, బొండాం సర్పంచ్ దురియా భాస్కరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థినికి అస్వస్థత

- హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు



పెదబయలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిశీలిస్తున్న వైద్యాధికారి, ఏటీడబ్ల్యూవో

పెదబయలు: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–1లో 8వ తరగతి విద్యార్థిని పోయిభ దీపిక శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో గుండెల్లో నొప్పి రావడంతో అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను మేట్రిన్, పాఠశాల హెచ్‌ఎం నారాయణ హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఏటీడబ్ల్యువో స్వర్ణలత పీహెచ్‌సీకి చేరుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నుంచి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్లకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. విద్యార్థిని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. గ్యాస్ట్రిక్ సమస్య వల్ల కూడా నొప్పి వచ్చే అవకాశం ఉందన్నారు. కొద్ది గంటలు పరిశీలించిన తరువాత జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

గోదావరి నీటిమట్టం తగ్గుముఖం



ముంపు నుంచి బయట పడిన గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం: మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతమైన గండిపోశమ్మ ఆలయం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. దీంతో అమ్మవారి ఆలయం ముంపు నుంచి బయటపడింది. కాఫర్ డ్యామ్ బ్యాక్‌వాటర్ వల్ల గత ఏడాది జూలైలో అమ్మవారి ఆలయంలో వరదనీరు చేరింది. అప్పటి నుంచి దర్శనాలు నిలిపివేశారు. ప్రస్తుతం నీటిమట్టం తగ్గింది. గురువారం నుంచి ఆలయంలో నీరు పూర్తిగా తొలగిపోయింది. పూర్తిగా నీటిమట్టం తగ్గిన తరువాతనే సంప్రోక్షణ చేపడతామని ఆలయ అధికారులు తెలిపారు.

పసుపు రైతుల నుంచి నమూనాల సేకరణ

ఆర్గానిక్ ధ్రువపత్రాలు అందించేందుకు కసరత్తు



సిరిపురంలో రైతుల వద్ద నుంచి పసుపు నమూనాలను సేకరిస్తున్న అధికారులు

చింతపల్లి రూరల్: గిరిజన ప్రాంతాల్లో రైతులు పండిస్తున్న పసుపునకు ఆర్గానిక్ ధ్రువపత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చింతపల్లి ఉద్యానవనశాఖ అధికారి బాలకర్ణ తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం పెదబరడ పంచాయతీ సిరిపురం గ్రామంలో రైతులు పండించిన పసుపు నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పండిన పసుపునకు ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ రైతులకు మంచి ఆదాయం చేకూరడం లేదన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పసుపునకు ఆర్గానిక్ ధ్రువపత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ ఆథారిటీ గుంటూరుకు చెందిన విస్తరణ పర్యవేక్షకులు డాక్టర్ రవి ఆధ్వర్యంలో నమూనాలు సేకరిస్తున్నామన్నారు. వీటిని ప్రయోగశాలలో పరిశీలించిన అనంతరం రైతులకు అవసరమైన ధ్రువపత్రాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలి అదృశ్యం


కమల(ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ హంసబంధ గ్రామానికి చెందిన కిల్లో నీలాంబరం ఇంటికి వచ్చేందుకు ఒడిశా నుంచి బయలుదేరిన ఆయన అత్త సాగరియ కమల(60) అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కోరాపుట్టు జిల్లా లంతాపుట్టు బ్లాక్ ఒనకడిల్లీ పంచాయతీ ఒనమహల్ గ్రామానికి చెందిన కమల ఈ నెల 2న ముంచంగిపుట్టు మండలం బరడ పంచాయతీ హంసబంధలోని అల్లుడు,కూతురు ఇంటికి బయలుదేరింది. అయితే ఆమె హంసబంధకు చేరుకోలేదు. కుటుంబ సభ్యులు,బంధువుల ఇళ్లల్లో వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు.దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఆంధ్ర,ఒడిశా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. కమల ఆచూకీ తెలిస్తే 8280419854,6303108501 అనే ఫోన్ నంబర్లకు సమాచారం తెలియజేయాలని కుటుంబ సభ్యులు కోరారు.

యువకుడు ఆత్మహత్య


వీరబాబు (ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామానికి చెందిన మింది వీరబాబు (22) అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా ఎస్.కోటలో వీరబాబు ఇన్‌స్టాల్‌మెంట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల అప్పులు పెరిగిపోవడంతో వీరబాబు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యాపారం చేసే చోటే వీరబాబు పురుగుమందు తాగాడు. విషయం తెలియడంతో స్నేహితులు అతనిని విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు బోరున విలపించారు.

గ్రామ వలంటీర్ల సేవలు ఆదర్శం


గంగవరంలో గ్రామ వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు


ఇందుకూరుపేటలోని కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు


పెదబయలులో వలంటీర్లకు అవార్డులు అందజేస్తున్న ఎంపీపీ వరహాలమ్మ, అధికారులు

గంగవరం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా గ్రామ వలంటీర్ల పనిచేస్తున్నారని, వారి సేవలు ఆదర్శమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండలంలోని నెల్లిపూడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు అందజేసేలా వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. కరోనా కష్టంలోనూ గ్రామ వాలంటీర్లు సేవలు ఎంతో గొప్పగా అందించారన్నారు. ఈ సందర్భంగా అన్నిక కుమార్ (నెల్లిపూడి), ఇంద్రసేనారెడ్డి (జడేరు), జి.ముత్యాలమ్మ(పిడతమామిడి), టి.బాబురావు (జగ్గంపాలెం), ఎస్.బాపూజీదొర (కొత్తాడ) ఐదుగురికి సేవా రత్న, మండలంలోని 163మందికి సేవా మిత్ర అవార్డులను అందజేసి సత్కరించారు.

ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం , వైస్.ఎంపీపీలు గంగాదేవి, రామతులసి, ఎంపీటీసీలు కనకలక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మావతి, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థదొర, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు రామలక్ష్మి, పార్వతీ, లక్ష్మి, శివ, లీలావతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేటలో వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడికి ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించేందుకు వలంటీర్ వ్యవస్థను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. మండలంలోని 177 మంది వలంటీర్లలోట ఒకరికి సేవా వజ్ర, అయిదుగురికి సేవా రత్న మిగిలిన వారికి సేవా మిత్ర అవార్డులను అందించారు. శాలువాతో సన్మానించారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సిరసం సత్యవేణి, ఎంపీడీవో రాజు, సత్యనారాయణ, మురళీ, చిన్ని, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎంపీపీ బొండా వరహాలమ్మ పాల్గొన్నారు. ఐదు గ్రామ సచివాలయాల పరిధిలోని పర్రెడ, గంపరాయి, అరడకోట.బొండాపల్లి, అడుగులపుట్టు ఎం.కృష్ణారావు, కె.నానిబాబు, ఎం.సరళకుమారి, పి.రాజు, పి.ఆనందరావులకు సేవ రత్న అవార్డులు అందజేశారు. 263 మందికి సేవ మిత్ర అవార్డులు అందజేశారు. ఎంపీపీ వరహాలమ్మ మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని కోరారు. ఎంపీడీవో విగ్గిన్స్. వైస్ ఎంపీపీలు పాంగి సోనె. కొర్రయ రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, ఈవోఆర్‌డీ నర్సింగరావు, నాయకులు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

జాఫ్రాకు గిట్టుబాటు ధర

రంపచోడవరం పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: జాఫ్రా పండించిన ప్రతీ గిరిజన రైతుకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా ఐటీడీఏ చర్యలు చేపట్టినట్టు పీవో సూరజ్‌గనోరే తెలిపారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ జాఫ్రాను దళారులకు అమ్ముకుని గిరిజన రైతుల మోసపోకుండా ఐదుగురు అధికారుల బృందంతో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పీఏఓ ఎల్.రాంబాబుకి పాతకోట, కొత్త పాకలు, ధారగడ్డ, దుంపవలస, పులిమెట్ల, లింగవరం , పూలోవ, కడారి కోట, బొడ్లంక, వీరంపాలెం, ఇర్లవాడ గ్రామాల్లో జాఫ్రా రైతులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. పీహెచ్‌ఓ చిట్టిబాబు బంద, కుందాడ, పొట్లవాడ, ముంజమామిడి, చెక్కవాడ, ఆకుమామిడికోట, ఉక్కులూరు, చట్లవాడ, పొట్లవాడ, మల్లిశాల, మద్దులూరు గ్రామాలల్లో జాఫ్రా రైతులను చైతన్యం చేస్తారని తెలిపారు. ఉపాధిహామీ ఏపీడీ జి.శ్రీనివాసరావుకు జీఎంవలస, బోదులూరు, ఆకూరు, కుత్రవాడ, పాములేరు, కాకూరు, ఇలివాడ, ఇచ్చులూరు, కోడూరు, ఈగవలస, ఎర్రగ్రడ్డ, కానివాడ, ఆకులేటివాడ, రంపచోడవరం వెలుగు డిపిఎం పరమేశ్వరరావుకు గుండ్రాతి, ఎగువలస, గుంపెనగండి, అద్దరివలస, పూసివాడ, పిడమర్రి, పాములమామిడి, బూసిగండి, కెచ్చలవాడ , పుల్లంగి గ్రామాలను, రంపచోడవరం హెచ్‌ఓ ముత్తయ్యకు మారేడుమిల్లి, మద్దులూరు, మూసూరు, పూజారిపాకలు, వేటుకూరు, పీఎం కోట, ఇవ్వంపల్లి భీమవరం, చింతలపూడి, రాచపాలెం గ్రామాల్లో జాఫ్రాలు కొనుగోలు చేసే విధంగా అధికారులను నియమించామన్నారు. గత ఏడాది కిలో జాఫ్రాను రూ. 48 నుంచి 50 రూపాయలు రైతులు అమ్మేవారిని ఈ ఏడాది కిలో రూ. 150 యస్. యన్ ఆగ్రో ఎగ్జిమ్స్ తుని వెండర్‌లతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఈ సంవత్సరంలో 100 మెట్రిక్ టన్నుల నుండి 200 మెట్రిక్ టన్నులు జాఫ్రాను కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రైతులు తూకాల్లో మోసపోకుండా డిజిటల్ కాటాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న గిరిజన రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఐటీడీఏ చొరవతో ఎన్నడూ లేని విధంగా కేజీ జాఫ్రా రూ. 150 కు ధర నిర్ణయించినట్టు చెప్పారు. గిరిజన రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ లక్ష్యమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని జీడిమామిడి పిక్కలు, పసుపు, చింతపండు ఈ ఏడాది నుంచి కొనుగోలు చేస్తామని యస్ యన్. ఆగ్రో ఎగ్జామ్స్ కంపెనీ ప్రతినిధి చంద్రశేఖర్ పీవోకు తెలిపారు.

జగనన్న పాలనలో మహిళలే మహారాణులు


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు

అరుకు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు చెట్టి పాల్గుణ

హుకుంపేట: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతు ఎటువంటి కష్టాలు లేకుండా మహారాణిలవలే జీవనం కొనసాగిస్తున్నారని అరుకు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవి పాఠశాల ప్రాంగణంలో వెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మహిళలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళలకు అందజేశారు.ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం సీఎం జగనన్న అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, తోడు తదితర పథకాల ద్వారా అనేక మంది మహిళలు ఆర్థికాభివృద్ధి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. మండంలోని 1896 మందికి అక్క చెల్లమ్మలకు రూ. 40,33,876 నగదును ప్రభుత్వ లబ్ధిదారుల్లో ఖాతాలో జమచేసిందన్నారు. స్త్రీనిధి పథకం ద్వారా నాలుగో విడతగా 577 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.2.93కోట్లు ఖాతల్లో జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపీపీ కూడా రాజుబాబు, వెలుగు ఏరియ కో-ఆర్డినేటర్ కృష్ణారావు, ఏపీఎం చిన్నారవు, ఈవోపీఆర్డి అప్పలరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, సాంభ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉన్నత విద్య

- జిల్లాలో రెండు జూనియర్ కళాశాలలు మంజూరు
- రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- బైపీసీ. ఎంపీసీ. సీఈసీ గ్రూపులకు గ్రీన్ సిగ్నల్

విశాఖ విద్య: పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్ కళాశాలలు అందుబాటులో ఉండేలా, ఇందులో ఒకటి బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అవసరమైన చోట్ల దశల వారీగా కొత్త కళాశాలల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొయ్యూరు, పెదబయలు మండలం సీతగుంటలో కళాశాలలు మంజూరయ్యాయి. ప్లస్-2 స్కూళ్లుగా గుర్తించే వీటిని పాఠశాలల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతీ చోటా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రతీ గ్రూపులో 40 మంది చొప్పున విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని ఆదేశించింది. 2024-25 విద్యా సంవత్సరంలో జూన్ ఒకటి నుంచి కాలేజీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హైస్కూళ్లలో పని చేసే క్వాలిఫైడ్ ఉపాధ్యాయులను కొత్త కాలేజీల్లో సబ్జెక్టు అధ్యాపకులుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. వీరికి ఒక ఇంక్రిమెంట్ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా డీవీఈవో మాట్లాడుతూ ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్ కాలేజీలు ఉండాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. దీని వల్ల పేద విద్యార్థులు,ముఖ్యంగా బాలికలు ఉన్నత చదువుల వైపు ఆసక్తి చూపేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉన్నత విద్యలో డ్రాపవుట్ నివారణకు దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

- కలెక్టర్ విజయ సునీత
- వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

పాడేరు : వచ్చే నెల 3వ తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయ సునీత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆమె ఐటీడీఏలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1,15,860 మంది సున్నా నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారన్నారు. వీరందరికి శతశాతం పల్స్‌పోలియో చుక్కలు వేయాలని సూచించారు. జిల్లాలో 4,252 గ్రామాల్లో 352 సబ్ సెంటర్లు ఉన్నాయన్నారు. ఇందుకు కోసం 2,402 పోలియో చుక్కల మందు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇంటింటి బృందాలు 3723 ఏర్పాటు చేయడమే కాకుండా 77 సంచార వాహనాలు కేటాయించినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి. అభిషేక్, డీఆర్వో లక్ష్మణమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా సుబ్బారావు


కలెక్టర్ విజయ సునీతను సత్కరిస్తున్న అల్లూరి యువజన సంఘం ప్రతినిధులు

సాక్షి, పాడేరు : అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా పాడేరు పట్టణానికి చెందిన కొట్టగుళ్లి సుబ్బారావును నియమించినట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తెలిపారు. శుక్రవారం పాడేరు ఐటీడీఏలో కలెక్టర్ విజయ సునీతను మర్యాద పూర్వకంగా కలిసి ఆమెను సత్కరించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను ఆదుకోవాలని ఆయన కోరారు. వారికి ప్రభుత్వం తరపున సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, వారి కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడేందుకు సహాయం అందజేయాలని కోరారు. విశాఖపట్నంలో చికిత్స పొందుతున్న గాం గంటం దొర మనువడు బోడిదొరకు మరింత మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవడమే కాకుండా అతని కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. అల్లూరి స్మారక మందిరాలు, పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ కార్యదర్శులు శ్యామల వరలక్ష్మి, శివంగి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పోతిన వెంకటేశ్వరరావు, రమణ, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా


విశాఖ విమానాశ్రయంలో అభివాదం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు


వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గొల్ల బాబూరావు, చిత్రంలో కంబాల జోగులు, కోలా గురువులు, కె.కె రాజు తదితరులు

- దళితుడినైన నన్ను రాజ్యసభ సభ్యుడ్ని చేశారు
- విమానాశ్రయంలో గొల్ల బాబూరావుకు ఘన స్వాగతం

గోపాలపట్నం/బీచ్‌రోడ్డు: దళితుడినైన తనకు రాజకీయంగా మహానేత వైఎస్సార్ అవకాశం కల్పిస్తే.. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తమ భవిష్యత్తు కల్పించారని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కొనియాడారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై తొలిసారిగా విశాఖ వచ్చిన ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. ఎయిర్‌పోర్టు నుంచి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు పీవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో బైక్‌లు, కార్లతో ర్యాలీగా డాబాగార్డెన్స్ సర్కిల్‌కు చేరుకుని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ ఒక దళితుడికి రాజ్యసభ సీటు ఇవ్వడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఈ సీటు బాబురావుకు కాదు దళితులందరికీ దక్కిన గౌరవమన్నారు. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. రాజ్యసభ సీటు పేరు చెప్పి వర్ల రామయ్యను చంద్రబాబు మోసం చేశారన్నారు. దళితుడికి ఇవ్వాల్సిన రాజ్యసభ సీటును తన సామాజిక వర్గానికి చెందిన నేతకు ఇచ్చి దగా చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. రాజ్యసభ సీట్లను వందల కోట్లకు అమ్ముకున్న చరిత్ర ఆయనదని విమర్శించారు. సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమవుతోందని మరోమారు రుజువైందన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల అభినందనలు

రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన గొల్ల బాబూరావును వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, నియోజకవర్గ పరిశీలకులు చిక్కాల రామారావు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కె.హనోక్, కార్పొరేటర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు బాబూరావుకు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏటీడబ్ల్యువో తిరుపాల్


పాడేరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సౌమ్య

జి.మాడుగుల: మండలంలోని జి.ఎం.కొత్తూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను ఏటీడబ్ల్యూవో ఎ.తిరుపాల్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులు, వసతి గృహ నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినా తక్షణమే వైద్యం చేయించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీను పాల్గొన్నారు.

పాడేరు: మండలంలోని మలకపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఈదులపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య శుక్రవారం సందర్శించారు. క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. పలు ఆరోగ్య సూచనలిచ్చారు. టీబీ సూపర్‌వైజర్ సదానందం, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ధనరాజు, హెచ్‌వీ కొండమ్మ, సీఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్‌ఎం గాయత్రి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

సింధియా: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్) ఆధ్వర్యంలో విశాఖపోర్ట్ అథారిటీ సహకారంతో 27 ఏళ్ల వయసులోపు నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. 10వ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డిప్లమో, ఇంజినీరింగ్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణులైన విశాఖ పోర్ట్ పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణకు అర్హులు. వీరికి కొరియర్ సూపర్‌వైజర్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్, ఇన్వెంటరీ కంట్రోలర్, సి.ఎన్.సి ఆపరేటర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీ కృష్ణ శివ్వం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సింధియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో గానీ, 99481 83865, 77948 40934, 0891-2704010ను సంప్రదించవచ్చు.

అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు


టేకు ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

మోతుగూడెం: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా ప్రణాళికపరంగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు చిరంజీవి చౌదరి ఆదేశించారు. శుక్రవారం ఆయన గొందిగూడెం బీట్‌లోని 1962 టేకు ప్లాంటేషన్‌తోపాటు ప్లస్ ట్రీని సందర్శించారు. అనంతరం లక్కవరం సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విశ్రాంతి భవనం, రేంజర్ కార్యాలయ మరమ్మతు పనులను పరిశీలించారు. సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌వో పుష్ప సౌజన్య, ఎఫ్‌ఆర్‌వో నానాజీ పాల్గొన్నారు.

దేశభక్తిని పెంచే 'ఆపరేషన్ వాలెంటైన్'


మాట్లాడుతున్న హీరో వరుణ్ తేజ్

బీచ్‌రోడ్డు: ఆపరేషన్ వాలెంటైన్ చిత్రం దేశభక్తిని పెంపొందించేలా ఉంటుందని ఆ చిత్ర కథానాయకుడు వరుణ్ తేజ్ తెలిపారు. భారత జవాన్లపై పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన దాడి, ఆ తర్వాత పాకిస్తాన్ ఉగ్రవాదులపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తీర్చుకున్న ప్రతీకారం వంటి అంశాలతో ఈ సినిమాను తీర్చిదిద్దినట్లు చెప్పారు. మార్చి ఒకటో తేదీన విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం వరుణ్‌తేజ్ విశాఖ వచ్చారు. ఓ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్రంలోని పలు సన్నివేశాల గురించి వివరించారు. ఎయిర్‌ఫోర్స్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కిన ఆపరేషన్ వాలెంటైన్ సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కంచె తర్వాత అంతటి దేశ భక్తి ఉన్న సినిమా ఆపరేషన్ వాలెంటైన్ అని, ఇటువంటి సినిమాలో నటించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు కూడా పైలట్‌లుగా రంగప్రవేశం చేసిన నేపథ్యంలో హీరోయిన్ పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఈ సినిమా కోసం ఎయిర్‌ఫోర్స్ అధికారులను కలసి అనేక అంశాలను తెలుసుకున్నానని, వారి నిజ జీవితానికి దగ్గరగా ఈ సినిమా ఉంటుందని వెల్లడించారు.